## హెచ్ఎండీఏ అధికారులపై అవినీతి ఆరోపణలు ఖండిస్తున్నాం

మియాపూర్, మే 13: హెచ్ఎండీఏ అధికారులపై అవినీతి ఆరోపణలు ఖండిస్తున్నామని మియాపూర్ లోని ఎంఏ నగర్‌కాలనీ వాసులు హైడ్రా కమిషనర్‌కు లేఖ ద్వారా వివరించారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేస్తూ మియాపూర్ విలేజీ పరిధిలోని 100,101 సర్వే నంబర్లు గల ప్రభుత్వ భూమికి గత ఆరు మాసాల కింద హెచ్ఎండీఏ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమి పరిరక్షణ కోసం పూర్తిగా కంచెను ఏర్పాటు చేశారు. కంచ ఏర్పాటు చేసిన అనంతరం ఏ ఒక్కరూ కంచెను దాటి ఎలాంటి నిర్మాణాలు చేయలేదని వారు లేఖలో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎంఏ నగర్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు హెచ్ఎండీఏ అధికారులు అవినీతికి పాల్పడి ప్రభుత్వ భూమిలో నిర్మాణాలకు సహకరించాలని చేసిన ఆరోపణలు ఎలాంటి వాస్తవం లేదని తము పూర్తిగా హెచ్ఎండీఏ అధికారులకు మద్దతుగా ఉన్నట్లు వారు ఆ లేఖలో పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు చేసిన వ్యక్తులు గతంలో హెచ్ఎండీఏ ల్యాండ్‌లో నోటరీ ద్వారా అమాయక ప్రజలకు ప్లాట్లు విక్రయించే ప్రయత్నం చేశారని వారి అవినీతి బయటపడకుండా అధికారులపై తప్పుడు ఆరోపణలు చేసిన విషయాన్ని వారు లేఖలో పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలు చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు తెలిపారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కేపీహెచ్‌బీకాలనీలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 12: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ 7వ పేజ్ లో జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. కాలనీలో లోప్రెషర్ సమస్యతో... సరిపడా తాగునీరు రావడం లేదని, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం, ఫుట్‌పాత్ ఆక్రమణలు, వైన్‌షాప్‌తో ఇబ్బందులు, వీధికుక్కలు, వీధి దీపాల సమస్యలు ఉన్నాయని కార్పొరేటర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలో ప్రజలకు సరిపడా తాగునీటి అందించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, కాలనీ ఆడ్ హక్ కమిటీ సభ్యులు ప్రతాప్, బత్తుల హరిబాబు, పొడుగు అప్పారావు, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, వెంకటేశ్వరరావు, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి వారధులుగా నిలవాలి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన వైష్ణోయ్ ఎంక్లేవ్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్, మే 13: కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు వారధులుగా నిలవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం 132 – జీడిమెట్ల డివిజన్ వైష్ణోయ్ ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైష్ణోయ్ ఎంక్లేవ్ నూతన సంక్షేమ సంఘం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సంక్షేమ సంఘ సభ్యులు ప్రజా ప్రతినిధులు, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలని అన్నారు. ఇప్పటికే కాలనీలో నెలకొన్న సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం జరిగిందని, కాలనీలోని స్యలపై ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వైష్ణోయ్ ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రంగు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎంపీఆర్ చంద్రశేఖర్, కోశాధికారి కె.రాకేశ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బి.కె. గౌడ్, సంయుక్త కార్యదర్శి ఏ.నాగరాజు, ఎం.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్.కె.పాండే పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో ఐక్యత నెలకొనాలి

జగద్గిరిగుట్ట, మే 13 : బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలతో ప్రజల్లో ఐక్యత నెలకొనాలని ఎమ్మెల్యే వివేకానంద్ కాంక్షించారు. జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దమ్మ బొడ్రాయి ప్రతిష్ఠకు మంగళవారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై పూజలు చేశారు. అదేవిధంగా కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. నియోజక వర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసే ప్రజలు తనను మూడవసారి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. కార్పొరేటర్ జగన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, వేణుయాదవ్, బాబుగౌడ్, విటల్, జైహింద్, ఎర్ర లక్ష్మయ్య, మహంకాళి, ఆలయ ప్రతినిధులు కాలనీవాసులు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్, స్థానిక నేతలు

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను కలిసిన ప్రజలు

దుండిగల్, మే 13: ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు మంగళవారం శంభీపూర్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలలో కొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కనీస వసతులు కల్పించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కృష్ణ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.



కార్మికునికి ఆర్థిక సహాయం అందజేస్తున్న డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్

## కార్మికులను అన్ని విధాలుగా అదుకుంటా

జీడిమెట్ల, మే 13 : కార్మికులకు అన్ని విధాల అండగా ఉండి ఆదుకుంటానని సుభాష్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ అన్నారు. నాలుగు రోజులక్రితం శివ జ్ఞాన సాయి పాలిమర్స్‌లో దిగ్గుమల్లు (జార్ఖండ్ వాసి)ఆపరేటర్‌గా పనిలో చేరాడు. ప్రమాదవశాత్తు చేతి వేళ్లకు గాయం అయింది. దీంతో విషయం తెలుసుకున్న ఆయన యాజమాన్యంతో మాట్లాడి చికిత్స నిమిత్తం హాస్పిటల్‌లో లక్ష రూపాయలు ఇప్పించి అతని చేతికి రూ.1,50,000 లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు భాస్కర్‌రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, మెహర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజా ప్రతినిధులు

దుండిగల్, మే 13: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సేవలందిస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ప్రణాళికలు లేకుండా చెరువు సుందరీకరణ పనులా ?

కేపీహెచ్‌బీ కాలనీ, మే 13: ముందస్తు ప్రణాళికలు లేకుండా చెరువు సుందరీకరణ పనులు చేపట్టడంతో పరిసర ప్రాంతాల్లో ముంపు సమస్య తలెత్తిందని, భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కోరారు. కూకట్‌పల్లి నల్లచెరువు పరిసర కాలనీలలో ముంపు సమస్యలు తలెత్తగా... బాధిత కుటుంబాలను పరామర్శించి బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... సుందరీకరణ పేరుతో హైడ్రా అధికారులు చేపట్టిన పనులతో కాలనీలలో ముంపు సమస్య ఎదురవుతుందని, చెరువులో మట్టిని గుట్టలుగా పోయడంతో నీరు సజావుగా వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీలలోని పేదల ఇండ్లలోకి వరద నీరు చేరిందని, రానున్న వర్షాకాలంలో ఈ సమస్య ఎలా ఉంటుందోనని అన్నారు. భవిష్యత్తులో సమస్య పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే చెరువు భూ యజమానులకు నష్ట పరిహారాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, సూర్యారావు, శ్రీకరరావు, నాగరాజు, దుర్గ ప్రసాద్, శంకర్‌రెడ్డి, విశాల్, సాగర్, క్రాంతికుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో వరదముంపు బాధితులను పరామర్శిస్తున్న కాంతారావు, రాజేశ్వరరావు

# బుద్ధ విగ్రహం ఆవిష్కరణ



ఓల్డ్ బోయిన్పల్లి సిండికేట్ బ్యాంక్ కాలనీలో బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ నరసింహయాదవ్

బాలానగర్, మే 13 : బుద్ధ జయంతిని పురస్కరించుకొని బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఓల్డ్ బోయిన్పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధి దుబాయ్ గేట్ సమీపంలోని సిండికేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ లో ఏర్పాటుచేసిన బుద్ధ విగ్రహాన్ని మల్కాజ్గిరి బుద్ధ భగవాన్ టెంపుల్ నిర్వాహకులు విజయ జాదవ్ ఆనందరావు లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బౌద్ధ సాంప్రదాయాలను పాటిస్తూ బుద్ధ జయంతి వేడుకలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర శాస్త్రి, సెక్రటరీ రామారావు, ఉపాధ్యక్షులు సుధాకర్‌రావు, కోశాధికారి నవీన్, సీనియర్ నాయకులు సూర్య ప్రకాశ్ రావు, జై హనుమంతరావు, ప్రదీప్, శ్రీహరి, గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్ మట్టి శ్రీనివాస్, పిట్ల రాజు ముదిరాజ్, పోచయ్య, రాజుగౌడ్, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుడు అక్రమం.. ఇప్పుడు సక్రమమా?



కైలాశ్‌నగర్ లేఅవుట్‌లో ఫెన్సింగ్ వేసి గేటు పెట్టిన ప్రైవేటు వ్యక్తులు

కొండాపూర్, మే 13 : నాలాతో పాటు కాలనీ రోడ్డు ఆక్రమించి అక్రమంగా ఫెన్సింగ్ వేశారంటూ గతంలో పలుమార్లు కూల్చివేతలు చేసిన అధికారులు ఇప్పుడు గమ్మున ఉన్నారు. గతంలో అక్రమం.. ఇప్పుడు సక్రమం ఎలా అయిందో? చందానగర్ సర్కిల్ –21 పరిధిలోని చందానగర్ డివిజన్ కైలాస్‌నగర్‌లో నాలా అనుకుని ఉన్న కాలి స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు తమ ప్లాట్ అంటూ ఫెన్సింగ్ వేశారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ శాఖల అధికారులు అక్రమ నిర్మాణం అంటూ ప్రహరీ, ఫెన్సింగ్‌లను పలుమార్లు కూల్చివేశారు. కాగా సదరు వ్యక్తులు మరోసారి నిర్మాణాలు చేపట్టి, ఈ స్థలం తమదేనంటూ సూచిక బోర్డు పెట్టారు. ఈ విషయమై ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులను పలుమార్లు విన్నవించినా.. పరిశీలిస్తామంటూ దాటవేసే స్తున్నారు. అధికారుల సమ్మతంతోనే సదరు వ్యక్తులు బోర్డును ఏర్పాటు చేసుకుని కార్లు పార్కింగ్ చేసుకుంటున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

**లేఅవుట్లో ఓపెన్ స్పేస్ గా..**

చందానగర్ సర్వే నంబర్ 209 లో ఉన్న కైలాశ్ నగర్ లేఔట్ లో నాలాను అనుకుని ఓపెన్ స్పేస్ ఉంది. కాగా 40, 41, 42 నంబర్ల ప్లాట్స్ తమవేనంటూ ప్రైవేటు వ్యక్తులు సదరు స్థలానికి ఫెన్సింగ్ వేసి గేట్ సైతం ఏర్పాటు చేశారు. ఇదివరకు ఇదే స్థలంలో ఏర్పాటు చేసిన కాంపౌండ్ వాల్, గేట్ లను అధికారులు కూల్చివేశారు. మరోసారి సదరు స్థలాన్ని కబ్జా చేసి గేట్, కాంపౌండ్ వాల్ నిర్మించినప్పటికీ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం పై పలు అనుమానాలు రేకుతుతున్నాయి.

**పరిశీలిస్తాం..**

కైలాశ్‌నగర్ నాలాపై అక్రమంగా నిర్మించిన రిటైనింగ్ వాల్ నిర్మాణం, ఫెన్సింగ్ ఏర్పాటును మరోసారి పరిశీలించి రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం.

– పావని, ఏఈ ఇరిగేషన్

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



కోలగాటి వెంకటేశ్వర్రావు

దుండిగల్, మే 13: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తాపీ మేస్త్రి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కోలగాటి వెంకటేశ్వరరావు (35), హేమ వెంకటలక్ష్మి దంపతులు 8 నెలల క్రితం నగరానికి వచ్చి, సూరారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ఉంటున్నారు. వెంకటేశ్వరరావు తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. (ఏప్రిల్) 30 వ తేదీన వెంకటేశ్వరరావు తాపీ పనులకు సంబంధించిన వస్తువులను వెంట తీసుకొని బయటికి వెళ్లాడు. రాత్రికి అయినప్పటికీ వెంకటేశ్వరరావు ఇంటికి రాకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**గాజులరామారం లో..**



పెద్ద పొట్టి వరప్రసాద్

గాజులరామారం లోని దేవేందర్ నగర్‌కు చెందిన పెద్ద పొట్టి వరప్రసాద్ (36) కార్పెంటర్. ఈ నెల 12వ తేదీన ( సోమవారం) మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఇంటికి రాలేదు. దీంతో కుటుం బ సభ్యులు ఆయన సెల్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వస్తుండడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్, మే 13: వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఈ నెల 12న మధ్యాహ్నం గుర్తు తెలియని 50 ఏండ్ల వ్యక్తి జీడిమెట్ల పిస్తా హౌస్ సమీపంలో పడి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. దీంతో మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మాణం

● ఫిర్యాదులు చేసినా పట్టించుకోని కమిషనర్



కొంపల్లి మున్సిపాలిటీ జయభేరిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ వాణిజ్య షెడ్డు

కుత్బుల్లాపూర్, మే 13: ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపడితే అందుకు లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాలి. దీనికి తోడు వారు నిర్మించే వాణిజ్య సముదాయాలు నిబంధనల మేరకు చేపట్టే ఆస్కారం లేదు.. ఇంకేముంది అధికారులు వస్తే చూసుకోవాల్సిందే.. ఇంకెవరైనా ప్రశ్నిస్తే మాట్లాడుకోవాల్సిందే.. ఇంకా మొండి చేస్తే బెదిరింపులకు దిగాల్సిందే అనే కోణంలో కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మాణాలను చేపడుతున్నారు. ఖజానాకు చిల్లి గవ్వ కూడా చెల్లించకుండానే వాణిజ్య వ్యాపార సముదాయాల కోసం బహుళ షెడ్డు నిర్మాణాలు రాత్రికి రాత్రే వెలుస్తున్నాయి. జయభేరి, దూలపల్లి ప్రాంతాల్లో ఇటీవల అక్రమ షెడ్డు నిర్మాణాలు కోకొల్లుగా వెలుస్తున్నాయి. అలాంటి వాటిపై సంబంధిత మున్సిపాలిటీ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేస్తే కేవలం నోటీసులు జారీ చేసి తప్పుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తూ... జేబులు నింపుకుంటున్నారని విమర్శలకు తావిస్తుంది. కమిషనర్ స్థాయి అధికారులు కూడా వారి మాటలకు వత్తాసు పలకల్సిన పరిస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అక్రమ నిర్మాణాలపై, ఇతర సమస్యలపై జిల్లా యంత్రాంగం చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటా? లేదా? వేచి చూడాల్సిందే!



అదే షెడ్డు నిర్మాణాన్ని మరింత విస్తరిస్తున్న నిర్మాణదారుడు

# విత్తన కంపెనీలలో ఆకస్మిక తనిఖీలు



కుత్బుల్లాపూర్ లోని పలు విత్తన కంపెనీలలో విత్తనాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ టాస్క్ ఫోర్స్ టీం అధికారులు

కుత్బుల్లాపూర్, మే 13: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు విత్తన కంపెనీలలో మంగళవారం వ్యవసాయ శాఖ మేడ్చల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. గండి మైసమ్మ దుండిగల్, కుత్బుల్లాపూర్, బాలానగర్ మండలం లో గల వివిధ విత్తన కంపెనీ లను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ ఆధ్వర్యంలో హైదరాబాద్ శాఖ విత్తన ధ్రువీకరణ అధికారి ఎం. శివకుమార్, మండల వ్యవసాయ అధికారి యాదగిరి, బాలనగర్ మండల వ్యవసాయ అధికారి సాయి రమేశ్ కొంపల్లి లోని నూజివీడు సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కుత్బుల్లాపూర్ మండలంలోని తెలంగాణ స్టేట్ సీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ విత్తన కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి విత్తన కంపెనీల నిర్వాహకులు నాణ్యమైన వితనాలు తయారు చేయాలని స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులు విత్తన నిల్వలను ఎప్పటికప్పుడు చూపించాలని తెలిపారు. ఎవరైనా అనుమతి, నాణ్యతలేని విత్తనాలు సరఫరా చేస్తే విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.


## ప్రేమ్‌నగర్‌లో మురుగు పరుగు



ప్రేమ్‌నగర్‌లో పరుగులు తీస్తున్న మురుగు నీరు

కొండాపూర్, మే 13 : శేరిలింగంపల్లి సర్కిల్ –20 కొండాపూర్ డివిజన్ లోని ప్రేమ్ నగర్ బీ బ్లాక్ కాలనీ హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉంటున్నా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. మురుగు నీరు రోడ్లపై పరుగులు తీస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నిర్మాణాలతో డ్రైనేజీతో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. మంచి నీళ్ల కోసం గంటల తరబడి నల్లాల దగ్గర పడిగాపులు కాస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని కోరారు.

## వాహనం పైనుంచి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



త్రివేద్ (ఫైల్ )

దుండిగల్, మే 13: వాహనంపై నుంచి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన బాచుపల్లి పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. భద్రాద్రి– కొత్తగూ డెం జిల్లా, నాచారం గ్రామానికి చెందిన రాజులపాటి త్రివేద్ (40) భార్య సుమలతతో ప్రగతినగర్ (మధురానగర్)లో ఉంటున్నారు. ఇతను నానక్‌రామ్ గూడలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్, వీరికి ఒక కొడుకు ఉన్నాడు. సోమవారం త్రివేద్ ఉద్యోగానికి వెళ్లి, తిరిగి రాత్రి 1గంట ప్రాంతంలో పల్సర్ బైక్ (ఏపీ 20,ఏటీ–4205) పై ఇంటికి వస్తున్నాడు. బాచుపల్లి సాయినగర్ కమాన్ వద్ద కింద పడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు అతడిని గాంధీ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడు ఆత్మహత్య

శేరిలింగంపల్లి, మే 13: అనారోగ్యంతో బాధపడుతూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గచ్చిబౌలి పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక మంగళూరుకు చెందిన కేశవ్ శెట్టి కుమారుడు గౌతమ్ శెట్టి(29) తన తల్లిదండ్రులతో కలిసి మై హోమ్ విహంగ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటు న్నాడు. ఆరు నెలల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సోమవారం తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గౌతమ్ శెట్టి తాను నివాసం ఉంటున్న భవ నం 11వ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.